24 నుంచి టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 24 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) అండర్-17 వన్డే టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. అమెరికా యూత్ క్రికెట్ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రైజర్స్, పాంథర్స్ టీమ్‌లు తలపడనున్నాయి. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్ల జెర్సీలను తెలంగాణ డీజీపీ జితేందర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. గ్రామీణ తెలంగాణ క్రికెటర్ల అభ్యున్నతి కోసం టీడీసీఏ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు అరుణ్, ఎస్‌జీఏఫ్ ఛైర్మన్ రామిరెడ్డి, టీడీసీఏ సభ్యులు ఉస్మాన్‌అలీ, సయ్యద్ నవాజ్‌షా, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

హైదరాబాద్ సిటీ,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ప్రవాస భారతీయులు స్థాపించిన బెర్క్‌షైర్ భారత్ కమ్యూనిటీ(బీబీసీ) చారిటబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం లండన్‌లోని స్లవ్‌లో నిర్వహించారు. ఆడవారిలో వచ్చే సెర్వికల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించామని ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక సభ్యురాలు అనిత ఆవుల తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సమస్యగా ఉంది. కానీ టీకాలు వేయడం, స్క్రీనింగ్, ముందస్తు చికిత్సతో క్యాన్సర్‌ను చాలావరకు నివారించవచ్చన్నారు. ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు క్యాన్సర్ నివారణకు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లీలా అంజిరెడ్డి, సుచిత్ర నోముల, మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేత


ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 40వ డివిజన్‌కు చెందిన జి.సోని అనే దివ్యాంగ బాలికకు జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గడ్డమీది రేఖాలక్ష్మణ్ సహకారంతో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు చేయూత అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్యబీరప్ప, అల్మాస్‌గూడ మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, వీరారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కిట్లు పంపిణీ


రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్ : పవిత్ర రంజాన్ సందర్భంగా ఆజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో గల అంజుమన్ ఎ మెహది వియా కమ్యూనిటీహాల్‌లో గురువారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల రేషన్ కిట్లు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలు కూడా రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆనందోత్సవాలతో జరుపుకోవడానికి రేషన్ కిట్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఆజంపుర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

మూగజీవాల దాహాన్ని తీర్చే ప్రయత్నం అభినందనీయం

కొత్తపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కాలనీల్లో శునకాలు, పక్షులు తదితర మూగజీవాల దాహాన్ని తీర్చేందుకు తొట్టెల ఏర్పాటుతో జీహెచ్ఎంసీ ప్రయత్నం అభినందనీయమని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ అధికారులు న్యూనాగోల్ కాలనీ రోడ్ నెం.10లో నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వాటిలో నీళ్లపోసి కార్పొరేటర్ వాటిని ప్రారంభించారు. డాగ్స్ టీమ్ సూపర్‌వైజర్ సాయి, నాయకులు జంగారెడ్డి, సుందర్‌నారాయణ, వెంకట్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మన్సూరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కంటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం సంతోషకరమని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్‌కాలనీలో గల ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ హాస్టల్‌లోని విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కార్పొరేటర్ కళ్లద్దాలను అందజేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, వైద్యులు అనిల్‌కుమార్, వీణ, ఏఎన్ఎం శ్రీలత, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, సౌరాల నవీన్, సిద్ధు, రమేష్‌చారి పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఎమ్మెల్యేకు సమన్లు

చంపాపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌ను ఉద్దేశించి ఇటీవల ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఈనెల 18న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. స్పందించిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఈనెల 27న కమిషన్ ఎదుట హాజరు కావాలని ఎమ్మెల్యేకు గురువారం సమన్లు జారీ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ ప్రగతినగర్‌కాలనీలో 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కొశిక ఐలయ్య సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో వార్డులోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ప్రగతినగర్‌కాలనీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, కాలనీవాసులు గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చారి, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంట్లూర్ గ్రామ పరువుపై పోస్టర్ల కలకలం

- ప్రధాన కూడళ్లలో గోడలకు అంటించిన గుర్తుతెలియని వ్యక్తులు



కుంట్లూర్‌లో గోడలపై వెలసిన పోస్టర్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో రాత్రికి రాత్రి వెలసిన వాల్‌పోస్టర్లు కలకలం సృష్టించాయి. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి కుంట్లూర్ గ్రామ పరిధిలోని ప్రధా న కూడళ్ల వద్ద కొన్ని పత్రికల కథనాలతో కూడిన ఫొటోలతో ఉన్న స్టిక్కర్లను గోడలకు అంటించారు. 'ఎటుపోతుంది కుంట్లూర్ పరువు' అంటూ ఉన్న స్టిక్కర్లను గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 20నుంచి 30 చోట్లా గ్రామంలోని గోడలకు అంటించినట్లు గ్రామస్థులు తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న కుంట్లూర్ గ్రా మాన్ని భ్రష్టుపట్టిస్తున్న వ్యక్తులు ఎవరు..? అంటూ ఇలాగే పోతుంటే కుంట్లూర్ ప్రజలను ఎవరు నమ్మరు. మేల్కోండి ప్రజలారా మేల్కోండి.. నిత్యం భూతగాదాలతో మీడియా, పోలీస్‌స్టేషన్‌లో కుప్పలుకుప్పలుగా పెరిగిపోతున్న దరఖాస్తులు దీనికి ఎవరు కారణం..? ఎవరు బాధ్యులు..? ఇప్పటికైనా మేల్కో ఓ నరుడా అం టూ..స్టిక్కర్లను అంటించారు. దీంతో స్టిక్కర్ల అంశం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతుల నిరసన

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలం అనాజ్‌పూర్‌లోని సర్వే నంబర్ 274,75,76,77లోని రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ 125మంది అసైన్డ్ రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టా పాను పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాను పుస్తకాలు వచ్చే వరకు ప్రాణాలు తెగించి పోరాడుతామని హెచ్చరించారు. 125మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇచ్చేలా గ్రామసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భిక్షపతిగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, ముత్యాలు, రాములు, వెంకటేష్, బాల్‌రాజ్, జంగయ్య పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో ఏఐ పాఠాలు

- 500 మంది విద్యార్థులకు కృత్రిమ మేధ బోధన
- పిల్లల్లో పెరుగుతున్న ఆసక్తి

పైలెట్ ప్రాజెక్టుగా సైదాబాద్ జోన్‌లో నాలుగు పాఠశాలల ఎంపిక


ఏఐ తరగతులను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ


మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఏఐ తరగతులు


ఏఐ పాఠాలు వింటున్న విద్యార్థి

సైదాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో 3,4,5తరగతి చదివే విద్యార్థులకు తెలుగు, గణితంలో నైపుణ్య సామర్థ్యాలు పెంచేలా తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పాఠాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద సైదాబాద్ జోన్ పరిధిలోని నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో ఈనెల 15న ప్రారంభించారు. ఇందుకు సరిపడా కంప్యూటర్లతో పాటు హెడ్‌ఫోన్స్, ఇంటర్నెట్ సదుపాయాలు, ఇతర అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను సమకూర్చారు. మలక్‌పేట పాఠశాల, శంకేశ్వర్ బజార్ పాఠశాల, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, గడ్డిఅన్నారం పాఠశాలలు ఎంపికయ్యాయి. దీంతో దాదాపు 500 మంది విద్యార్థులకు ఏఐ పాఠాల ద్వారా మేలు జరుగనుంది. జూన్‌లో మిగతా 23 ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్-ఏఐ(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ-ఏఐ) సహకారంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) చేపట్టింది.

వారానికి నాలుగు సెషన్స్

ఏఐ ఆధారిత టూల్స్ ఉపయోగించి విద్యార్థుల్లో రాసే, చదివే స్కిల్స్‌ను మెరుగుపరచనున్నారు. విద్యార్థులను గ్రూప్‌గా చేసి ఏఐ ద్వారా బోధిస్తారు. వాళ్ల సిలబస్‌లో ఉన్న పాఠాలనే ఈ కోర్సులో చేర్చారు. ఈకే-స్టెప్ అనే కంపెనీ తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌తోనే ఈ బోధన చేపడుతున్నారు. తెలుగు, ఆంగ్లం కోసం అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్(ఏఎల్ఎల్) గణితం కోసం అసిస్టెడ్ మ్యాథమెటిక్స్ లెర్నింగ్(ఏఎంఎల్) ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాలంటే విద్యార్థులకు కేటాయించిన వ్యక్తిగత ఆధారాలతో కంప్యూటర్ లాగిన్ కావాలి. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల అంచనా బట్టి వారానికి నాలుగు సెషన్స్ ఉంటాయి.

ఏఐ ఆధారిత డిజిటల్ విద్యలో కీలక అంశాలు

ఏఐ ఆధారిత టూల్స్‌తో పిల్లల్లో రాయడం, చదవడం, సంఖ్యావిజ్ఞానం పెంపొందిస్తుంది. విద్యా ప్లాట్‌ఫారంలు, పర్సనలైజ్డ్ లెర్నింగ్ టూల్స్ ద్వారా విద్యార్థుల అభ్యాస పద్ధతులను మెరుగుపరుస్తుంది. విద్యార్థులలోని బలహీనతలను గుర్తించి కస్టమైజ్ లెర్నింగ్ మోడల్స్ ద్వారా అభ్యాసంతో మెరుగుదల సాధించవచ్చు. డిజిటల్ వినియోగంపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించడం, నూతన విద్యా విధానాలను అందిపుచ్చుకునేలా చేయడం జరుగుతుంది. సాంకేతిక అందుబాటుతో విద్యార్థి స్వయం అనుభవం మాదిరి పాఠం నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు విత్తనం మొలకెత్తడం, వృద్ధిచెందడానికి సంబంధించి థీయరీ మాత్రమే పుస్తకాలలో ఉంటుంది. వర్చువల్ విధానంలో విద్యార్థికి కెమెరా లెన్స్ పరికరం ఇస్తారు. దీన్ని ధరించిన తర్వాత విత్తనం తానే నాటి, అది దశలవారీగా ఎలా ఎదుగుతుందో పరిశీలిస్తున్న అనుభూతి పొందుతారు. దీని వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగడంతో పాటు, జ్ఞాపకశక్తి మెరుగయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

జూన్‌లో మిగతా 23 పాఠశాలల్లో ఏఐ పాఠాలు



తొలి విడతలో ఈనెల 15న నాలుగు స్కూళ్లలో 3,4,5 తరగతుల విద్యార్థులకు ఏఐ పాఠాలు ప్రారంభించాం. జూన్‌లో మిగతా 23 పాఠశాలల్లో ఏఐ పాఠాలు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత మంది ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఆధునిక నైపుణ్యం ఇప్పించాలని కసరత్తు చేస్తున్నాం. ఈ విధానంతో సర్కారు బడులు మరింత బలోపేతం కానున్నాయి.

- తిరునగరి రాధాకృష్ణ, డిప్యూటీ డీఈఓ

17 రోజుల్లో రూ.11.23 కోట్ల వసూలు

- ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీపై పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో భారీ స్పందన
- రాష్ట్ర వ్యాప్తంగా టాప్-5 స్థానంలో పెద్దఅంబర్‌పేట్


మున్సిపాల్టీలో ఎల్ఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రకటించిన 25శాతం రాయితీకి పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్ల యాజమానుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. 17 రోజుల్లో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఆర్ఎస్ ప్లాట్లకు చెల్లించిన ఫీజుల ద్వారా ప్రభుత్వానికి రూ.11.23 కోట్ల ఆదాయం సమకూరింది. ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు రూపంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ టాప్-5 స్థానంలో ఉన్నట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. నెలాఖరు వరకు ఉన్న ఈ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఆన్‌లైన్‌లో ప్రొసీడింగ్‌ల పంపిణీ

నేటి వరకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో 32,750 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా మున్సిపల్ అధికారులు ఫీజు వివరాల సమాచారాన్ని అందించారు. అందులో గురువారం వరకు 1486మంది తమ ప్లాట్లకు సంబంధించి ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించారు. కేవలం వారి ద్వారానే రూ.11.23 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖాతాకు చేరింది. ఫీజులు చెల్లించిన 1486లో 244మంది ప్లాట్ల యజమానులకు ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లను పంపించినట్లు కమిషనర్ తెలిపారు. ఫీజు చెల్లించిన మిగతా 1242 ప్లాట్ల యజమానులకు త్వరలోనే ప్రొసీడింగ్‌లను పంపించనున్నట్లు స్పష్టం చేశారు. ఫీజు సమాచారం ఇచ్చిన ఇంకా వేలమంది రాలేదని వారందరు ఈ నెలాఖరు వరకు వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన 25శాతం ఫీజు రాయితీ అవకాశ సమయం దగ్గర పడుతుండడంతో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు పెద్దఎత్తున వస్తున్నారని పేర్కొన్నారు. మరో పది రోజుల్లో భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు.

హనుమాన్ ఆలయ హుండీల లెక్కింపు

చంపాపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలోని ప్రధాన ఆలయం ధ్యానాంజనేయస్వామితో పాటు ఇతర ఆలయాలలో ఏర్పాటు చేసిన 105రోజుల హుండీలను గురువారం రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.శేఖర్, ఆలయ ఈవో ఎస్.లావణ్య సమక్షంలో తెరిచి లెక్కించారు. ఈ హుండీల లెక్కింపులో స్వామి వారికి రూ.40,83,498లతో పాటు 83 యూఎస్ డాలర్లు, 10 గ్రేట్ బ్రిటన్ పౌండ్స్, 10 అరబ్ దిర్హామ్, 5 కెనడా డాలర్లు, 21 సింగపూర్ డాలర్లు, 70 నేపాలిస్ రూపీస్, 10 యూరోలు, 1 అజర్ బైజాన్ మనాట్ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో అర్చకులు అంబయ్య, కందాళ సంతోష్‌కుమార్, ఎస్.శ్రవణ్‌కుమార్, ఆలయ సిబ్బంది ఎం.వెంకటయ్య, జి.రమాదేవి, టి.వేణుగోపాల్, స్వాతి, మాజీ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, శివకేశవ స్వచ్ఛంద సేవా సమితి వలంటీర్లు, కర్మన్‌ఘాట్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ సైదులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజీద్‌పూర్ మహమ్మాయిపురంలోని మహమ్మాయిదేవి కల్యాణ రథోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. అనంతరం స్వామి వారికి అభిషేకం మధ్యాహ్నం భక్తుల సమక్షంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టీ సభ్యుడు యెర్రవెల్లి మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

'మాతృదేవోభవ'ను సందర్శించిన లేడీ అఘోరీ

సరూర్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమాన్ని గురువారం సాయంత్రం లేడీ అఘోరీ నాగసాధు సందర్శించారు. ముందుగా ఆశ్రమంలోని సహస్ర లింగేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో పూజలు నిర్వహించి అందరికీ హారతి ఇచ్చారు. అనంతరం అభాగ్యుల బాగోగుల గురించి ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరిని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలోని అభాగ్యులకు నిర్వాహకులు అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. తన వంతు సాయంగా ఆశ్రమానికి క్వింటాల్ బియ్యం, పండ్లు అందజేశారు.

యువకుడు అదృశ్యం


సుజయ్ నికేష్

హయత్‌నగర్ : యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కాకినాడ జిల్లా జగన్నాథపురం, ముళ్లివారి వీధికి చెందిన బీశెట్టి సుజయ్ నికేష్(23) సోమవారం రోజు ఇంటర్వ్యూ ఉందని తండ్రి రుద్రేశ్వర్‌రావుతో కలిసి వచ్చాడు. రాత్రి కావడంతో పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం వద్ద గల అన్నపూర్ణా లారీ సర్వీస్‌లో ఉన్నారు. రాత్రి ఇద్దరు కలిసి భోజనం చేసి అందులోనే నిద్రించారు. ఉదయం నిద్రలేచి తండ్రి చూడగా సుజయ్ నికేష్ కనిపించలేదు. దీంతో తండ్రి కుమారుడి ఆచూకీ కోసం చుట్టు పక్కల, సొంత ఊరులో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్..


షేక్ బాబా

హయత్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ హనుమాన్‌నగర్‌కాలనీకి చెందిన షేక్ బాబా(24) వృత్తి కారు డ్రైవర్. ఆదివారం రాత్రి 10గంటలకు అందరితో పాటు భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం 10గంటలకు షేక్ బాబా తమ్ముడైన అక్బర్‌కు ఫోన్‌చేసి ఇంటి బయట బోరు వేస్తున్నారు. ఇంటిపైన ఆరేసిన బట్టలను తీయాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత సోమవారం మధ్యాహ్నం తమ్ముడు అక్బర్ అన్నకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. సాయంత్రం అయినా షేక్ బాబా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో గురువారం ఉదయం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహం పై పోలీసుల దాడి

చాదర్‌ఘాట్ : మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార గృహం నిర్వహిస్తున్న లావణ్య స్పాసెంటర్‌పై సీ.సీ.ఎస్ స్పెషల్ టీం పోలీసులు గురువారంరాత్రి దాడులు నిర్వహించారు. ఒక కస్టమర్‌తో పాటు ఏడుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం స్పెషల్‌టీం పోలీసులు మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల తీరు మారాలి

- బీఆర్ఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల తీరు మారాలని ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, పద్మనాయక్, విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డిలు అన్నారు. వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు సంవత్సరాలుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి 95శాతం అభివృద్ధి పనులు చేపట్టిన విషయం మరువరాదని, కేవలం 5శాతం అభివృద్ధి నిధులు తెచ్చిన మీరా ఎమ్మెల్యే గురించి మాట్లాడేది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ విషయం మాట్లాడుతున్న కార్పొరేటర్లు గతంలో అభివృద్ధి పనుల విషయంలో కార్పొరేటర్లను ఆహ్వానించిన విషయం మరువరాదని హితవు పలికారు. కానీ ఇద్దరు, ముగ్గురు బీజేపీ కార్పొరేటర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు కలిసి తమ పనులమీద కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీగౌడ్‌ను కలిసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు ఏ విధంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీగౌడ్‌ను ఎందుకు తప్పు పట్టడం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిసి పనిచేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమని వారు చెప్పారు. ఎల్బీనగర్ అభివృద్ధికి నిరంతరం పాటుపడే ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సహించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెరుకు ప్రశాంత్‌గౌడ్, మిట్ట రామ్మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఫరీద్‌కు జైలుశిక్ష


రౌడీషీటర్ ఫరీద్

చంపాపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లో 2018లో సయ్యద్ అస్లాంపై మారణాయుదాలతో దాడిచేసిన కేసులో రౌడీషీటర్ ఎస్‌కే.షేక్‌ఫరీద్(38)కు గురువారం నాంపల్లి 7వ ఏఎస్‌జే కోర్టులో న్యాయమూర్తి సీవీఎస్ సాయి భూపతి 7సంవత్సరాల జైలుశిక్ష, రూ.2500 జరిమానాను విధించినట్లు ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపారు. 7-6-2018లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు హఫీజ్‌బాబానగర్‌లో మొబైల్‌షాప్ నిర్వాహకుడు షేక్‌ఫరీద్ అదే ప్రాంతం ఏ బ్లాక్‌కు చెందిన మిన్హాజ్‌ఫాతీమా(25)ను ప్రేమపేరుతో వేధించాడని, ఈ విషయంలో ఆమె అన్నయ్య సయ్యద్ అస్లాం షేక్ ఫరీద్‌తో గొడవపడ్డాడు. అది మనుసులో పెట్టుకున్న షేక్ ఫరీద్ 6-6-2018న రాత్రి అస్లాం ఇంటికి వెళ్తుండగా అతనిపై మారణాయుదాలతో దాడిచేసి గాయపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంబరాలు

బీసీ బిల్లు ఆమోదంపై న్యాయవాదుల హర్షం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు మంత్రివర్గానికి, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన విధంగా పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదింపజేయాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, పొన్నం దేవరాజ్‌గౌడ్, జిల్లా రమేష్, భిక్షపతిగౌడ్, శంకరయ్య, భిక్షమయ్య, జంగయ్య, బర్ల సునీత, కేరిత్, అనసూయ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

సరూర్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లులకు ఆమోదం సాహసోపేత నిర్ణయాలని, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆమె క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో ఆయా బిల్లులు ఆమోదం పొందడంతో అటు ఎస్సీలు, ఇటు బీసీలకు అన్ని రంగాల్లో సరైన న్యాయం జరుగనున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సుభాన్‌యాదవ్, దయారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సీఎం, రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్

ఎస్సీల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం : కోట్ల శ్రీనివాస్

చాదర్‌ఘాట్ : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ బిల్లును మొట్టమొదట ఆమోదం కల్పించి గుర్తింపు పొందడంతో పాటు వారి సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నది సీఎం రేవంత్‌రెడ్డి అని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ కొనియాడారు. గురువారం మూసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ భువనగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం కల్పించడంతోపాటు రిజర్వేషన్లు ప్రకటించడంలో చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ చిత్రపటానికి మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కోట్ల శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, ఉపాధి అన్ని రంగాల్లో అందరికి సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించాలన్న లక్ష్యంతోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వినోద్, కృష్ణ, రాంచందర్, నరేందర్, జంగయ్య, యాదగిరి, రమేష్, మదన్‌మోహన్, రసూల్ పాల్గొన్నారు.


రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకంలో పారిజాతారెడ్డి తదితరులు

ఓల్డ్‌మలక్‌పేట : ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ ఓల్డ్‌మలక్‌పేటలో గురువారం గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏండ్ల పోరాటం ఫలితంగా దళితులకు న్యాయం జరుగుతుందని దళిత సేవాసంఘం నాయకులు పేర్కొన్నారు. రాజేందర్, వీరమణి, ప్రవీణ, సింహచలం, గీతాబాయ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.